

కీచక ఉపాధ్యాయుడు
లక్కిరెడ్డిపల్లి మండలం రవీంద్రనగర్ ప్రాథమిక పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడు విద్యార్థినుల పట్ల అభ్యకరంగా ప్రవర్తిస్తున్న సంఘటన వెలుగులోకి వచ్చింది. -8లో



చీనీ వ్యాపారిపై తెలుగు తమ్ముళ్ల దాడి
వైఎస్సార్ జిల్లా పులివెందుల మార్కెట్ యార్డు సమీపంలోని ఒక హోటల్ వద్ద చీనీ వ్యాపారిపై తెలుగు తమ్ముళ్లు దాడి చేసిన సంఘటన శని వారం చోటుచేసుకుంది. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
34.2/25.6

వాతావరణం
జిల్లాలో శనివారం 25.6 – 34.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

కడప కార్పొరేషన్: విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం ఆదివారం సెలవు దినం అయినప్పటికీ జిల్లా వ్యాప్తంగా విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యధాతథంగా పనిచేస్తాయని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ తెలిపారు.ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

'ఇంజినీరింగ్' పుస్తకాలకు దరఖాస్తు చేసుకోవాలి

కడప రూరల్: ఇంజినీరింగ్ విద్యను అభ్యసించే పేద విద్యార్థులు ఉచితంగా పుస్తకాలు పొందడానికి దరఖాస్తు చేసుకోవాలని గంజికుంట ఫౌండేషన్ కార్యదర్శి గంజికుంట గణేష్ తెలిపారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. గంజికుంటఫౌండేషన్.సీఓఎం వెబ్‌సైట్ ద్వారా ఆగస్టు 14వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9059598222 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

29న బహిరంగవేలం

కడప అగ్రికల్చర్: వైఎస్సార్ జిల్లా వీరపునాయనపల్లె మండలం కొమ్మద్ది గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వరాయ సాగర్ ప్రాజెక్టులో చేపలు పట్టుకుని అమ్ముకునేందుకు ఈ నెల 29న కొమ్మద్ది గ్రామ సచివాలయంలో బహిరంగ వేలం పాట నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా మత్స్య అభివృద్ధి అధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. అధార్‌కార్డు జిరాక్స్, రూ. 10 వేలు చెల్లించి వేలం పాల్గొనవచ్చని సూచించారు. రిజర్వాయర్ గుత్తపైకం మొత్తం రూ. 2,93,113 నుంచి మొదలవుతుందని తెలిపారు. ఈ వేలం ఈ నెల 1వ తేదీ నుంచి 2015 జూన్ వరకు చేపలు పట్టుకుని అమ్ముకునే హక్కు ఉంటుందని ఆయన చెప్పారు.

నూతన నియామకం



శివశంకర్

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా శివశంకర్‌ను నియమించినట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. శనివారం కడపలోని సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న కెజీ టూ పీజీ విద్యారంగ సమస్యల పై,ఎస్సీ ,ఎస్టీ, బీసీ ,మైనార్టీ ,సంక్షేమ హాస్టల్ సమస్యల పైన పోరాటాలు చేస్తామన్నారు. అనంతరం జిల్లా ఆఫీస్ బేరర్స్ సమక్షంలో కడప నగర కార్యదర్శిగా ఉన్న కె .శివశంకర్ ను జిల్లా అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు వలరాజు తదితరులు పాల్గొన్నారు.

పట్టం కట్టినా.. ప్రాధాన్యత ఏదీ!

'వినేవారు లోకువైతే చెప్పేవారు చంద్రబాబు' అనే నానుడి ఉంది. విపక్షంలో ఓ మాట..అధికారంలో మరోమాట మాట్లాడడం ఆయనకే చెల్లు. అందుకు ప్రత్యక్ష ఉదాహరణగా జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను చెప్పుకోవచ్చు. అధికారంలో ఉంటే విస్మరించడం.. లేకపోతే ప్రాజెక్టుల సందర్శనంటూ హంగామా చేయడం జిల్లా వాసులకు ఎరుకే. గండికోట ప్రాజెక్టు నిర్మాణానికి 1996, 99 ఎన్నికలకు ముందు రెండుసార్లు శంకుస్థాపన చేయడం మినహా, ఆ ప్రాజెక్టు నిర్మాణం పట్ల చంద్రబాబు సర్కార్ నిర్లక్ష్యమే ప్రదర్శించింది. రాయలసీమలో తమకు ఓట్లు, సీట్లు ఇవ్వరని, అందుకే అభివృద్ధి చేయలేదని ప్రకటించడం గమనార్హం.

- నాటి నుంచి రాయలసీమ ప్రాజెక్టుల పట్ల చంద్రబాబుకు అంతులేని నిర్లక్ష్యం
- జీఎన్ఎస్ఎస్‌కు ప్రాధాన్యత ఇచ్చింది వైఎస్సార్– వైఎస్ జగన్ ప్రభుత్వాలే
- 2014–19లో చంద్రబాబు సర్కార్ నామమాత్రపు వెచ్చింపు
- గండికోటకు రెండు సార్లు శిలాఫలకాలు వేసిన ఘనత బాబుదే
- సీఎంగా వైఎస్ జగన్ హయాంలో 27 టీఎంసీల నీటితో కళకళలాడిన గండికోట



గండికోట ప్రాజెక్టు

సాక్షి ప్రతినిధి, కడప: నిర్దిష్ట అభివృద్ధి సాధించే అవకాశం ఉన్నా సాగునీటి ప్రాజెక్టు పట్ల ఇదివరకు టీడీపీ సర్కార్ అంతులేని నిర్లక్ష్యం ప్రదర్శించింది. ఈ మారైనా చిత్తశుద్ధితో సాగునీటి ప్రాజెక్టుల ప్రయోజనాలు కాంక్షించాలని ప్రజలు కోరుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా 1995–2004, విభజన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా 2014–19లో నారా చంద్రబాబునాయుడు సాగునీటి ప్రాజెక్టుల పట్ల పూర్తి నిర్లక్ష్యం చూపారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులంటే మండిపడేవారు. నిన్నమొన్నటి వరకు 25 టీఎంసీల నిల్వకు కారణమైన గండికోట ప్రాజెక్టును ఉమ్మడి ఏపీలో నాన్ ప్రియారిటీ జాబితాలోకి చేర్చిన చరిత్రను కూడా చంద్రబాబునాయుడు మూట గట్టుకున్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖరరెడ్డి రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు నీరు చేరాలంటే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ విస్తరణ ఒక్కటే మార్గమని తలచారు. అలా చేస్తేనే కాస్తో, కూస్తో రాయలసీమ ప్రాంతానికి నీరు చేరుతుందని మనస్ఫూర్తిగా నమ్మారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని వైఎస్సార్ సర్కార్ పెంచుతుంటే, తెలుగుదేశం పార్టీ నేత దేవినేని ఉమామహేశ్వరావు ద్వారా అడ్డుకునే ప్రయత్నం కూడా చేపట్టారు. 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాతైనా ఈ ప్రాంత ఉన్నతికి కృషి చేస్తారంటే ఐదేళ్ల కాలం ఊకదంపుడు ఉపన్యాసాలతో సరిపెట్టారని పలువురు గుర్తు చేస్తున్నారు.

కరువు నివారణకు ప్రత్యేక ప్రణాళిక

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాయలసీమ కరువు నివారణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. జీఎన్ఎస్ఎస్–హెచ్ఎన్ఎస్ఎస్ అనుసంధానం ప్రక్రియను ప్రారంభించి వేగవంతంగా పనులు చేపట్టింది. 12టీఎంసీ నీరు జీఎన్ఎస్ఎస్ ద్వారా లిఫ్ట్ చేసి చిత్తూరు అన్నమయ్య జిల్లాల్లో కరువు నివారణకు శ్రీకారం చుట్టింది. హెచ్ఎన్ఎస్ఎస్ కాలువలో జంగందేవరపల్లె వద్ద నీరు కలపడం ద్వారా పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు, పలమనేరు, కుప్పం, రాయచోటి నియోజకవర్గాలను సస్యశ్యామలం చేసేందుకు అనువుగా మారింది. ఇలాంటి ప్రాజెక్టుల పట్ల చిత్తశుద్ధి ప్రదర్శించి పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రస్తుత చంద్రబాబు సర్కార్‌పై ఉంది. మరోవైపు జలాశయాలు ఉన్నా, వాటి ఫలాలు క్షేత్రస్థాయిలో దక్కలేదు. డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ లేకపోవడమే అందుకు ప్రధాన కారణం. సీఎం చంద్రబాబు కోరినట్లుగా జిల్లాలో సీట్లు, ఓట్లు కూడా లభించాయి. ఈమారైనా జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పట్ల చంద్రబాబు సర్కార్ ప్రత్యేక దృష్టి సారించి పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. అందుకు అధికారపార్టీ ఎమ్మెల్యేలు మరింత బాధ్యతగా మెలగాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

చంద్రబాబు శంకుస్థాపనతో సరి...

గండికోట ప్రాజెక్టుకు 1996 ఫిబ్రవరి 29న ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబునాయుడు కెట్టివారిపల్లె సమీపంలో శంకుస్థాపన చేశారు. వామికొండ వద్ద మరోమారు 1999 ఎన్నికలకు ముందు శంకుస్థాపన చేశారు. తర్వాత ఆ ప్రాజెక్టు పట్ల ఏమాత్రం శ్రద్ధాసక్తులు చూపలేదు. మరోవైపు గండికోటను నాన్ ప్రియారిటీ జాబితాలోకి చేర్చారు. 2004లో అధికారంలో దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి వచ్చాకే ప్రాజెక్టుల పనులను పరుగులు పెట్టించారు. ఆయన హయాంలో రూ.3213 కోట్లు వెచ్చిస్తే, తర్వాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు కేవలం రూ.804 కోట్లు మాత్రమే వెచ్చించారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా గాలేరు నగరి సుజల స్రవంతి (జీఎన్ఎస్ఎస్) పరిధిలో రూ.4256 కోట్లు వ్యయం చేశారు. మరో రూ.454 కోట్లు నిర్వాసితులకు చెల్లించారు. పైగా 26.85 టీఎంసీల నీరు నిల్వ చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్‌కే దక్కిందని పలువురు వివరిస్తున్నారు.

అయా ప్రాజెక్టుల నిర్మాణాలకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, సీఎం చంద్రబాబునాయుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాయాంలో ఖర్చు చేసిన వివరాలు (రూ. కోట్లలో)

ప్రాజెక్టు	వైఎస్సార్ హాయాం 2014కు ముందు	చంద్రబాబు సర్కార్ 2014-19	వైఎస్ జగన్ సర్కార్ 2019-24
గండికోట	819	413.5	504
సర్వారాయసాగర్	209.48	78.9	212
జీఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్	405.3	164.9	698.3
సిబీఆర్	601	24.28	250.68
సీబీఆర్ రైట్ కెనాల్	352.8	9.80	55.50
పైడిపాళెం	736.9	113.5	142
గండికోట టన్నల్ విస్తరణ	–	–	250
అవుకు టు గండికోట కెనాల్ విస్తరణ	–	–	500
రాయల సీమ డ్రాట్ మిటిగేషన్ ప్రాజెక్టు	–	–	1644

ఆగస్టు 3న రెండో విడత ఎంపిక జాబితా



వేంపల్లె: ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ఒంగోలు, నూజివీడు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు సంబంధించి రెండో విడత ఎంపిక జాబితాను ఆగస్టు 3వ తేదీన విడుదల చేయనున్నట్లు అడ్మిషన్ల ప్రక్రియ కన్వీనర్ ప్రొ.అమరేంద్రకుమార్ సంద్రా తెలిపారు. ఈ నెల 22 నుంచి 27వ తేదీ వరకు కొనసాగిన మొదటి విడత కౌన్సెలింగ్‌కు 4 క్యాంపస్‌ల నుంచి మొత్తం 4140 మంది విద్యార్థులను పిలిచామన్నారు. అందులో 3396మంది హాజరై అడ్మిషన్లు పొందారన్నారు. 744 సీట్లు మిగిలాయని, వీటి భర్తీ కోసం రెండో విడత జాబితాను సిద్ధం చేయనున్నట్లు చెప్పారు. మొదటి విడతలో ఎంపికై హాజరుకాని విద్యార్థులు www.rgukt.in వెబ్ సైట్ ద్వారా రెండో విడత కౌన్సెలింగ్‌కు నమోదు చేసుకోవాలన్నారు. అలాగే మొదటి విడతలో అడ్మిషన్ పొందిన విద్యార్థులు ఎవరైనా క్యాంపస్ మార్పు చేసుకోదలచిన వారు సదరు వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. 28వ తేదీ నుంచి ఈ నెల 30వ తేదీ సాయంత్రం 6 గంటలలోపు మాత్రమే వెబ్‌సైట్ అందుబాటులో ఉంటుందన్నారు. అడ్మిషన్ పొందిన విద్యార్థులు ఆగస్టు 19, 20 తేదీల్లో వారికి కేటాయించిన క్యాంపస్‌లో తరగతులకు హాజరు కావాలని కోరారు.

ఏపీపీఎస్సీ డిపార్ట్ మెంటల్ పరీక్షలను పటిష్టంగా నిర్వహించాలి




మాట్లాడుతున్న డీఆర్వో గంగాధర్‌గౌడ్

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో ఏపీపీఎస్సీ డిపార్టుమెంటల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర గౌడ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ డీఆర్వో చాంబరులో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో నిర్వహించే డిపార్ట్ మెంటల్ పరీక్షల నిర్వహణపై డీఆర్వో గంగాధర గౌడ్.. ఏపీపీఎస్సీ పరీక్షల జిల్లా ప్రత్యేక అధికారులైన పర్యవేక్షకులు డీఎస్ మల్లికార్జున రెడ్డి, డి.నాగ భూషణంలతో కలిసి పరీక్షల విధులు కేటాయించిన లైజెస్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటిండెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో డిపార్ట్ మెంటల్ పరీక్షలు ఈ నెల 28వ నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు రెండు సెషన్లలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 వరకు, కన్వెన్షనల్ విధానానికి సంబంధించిన పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు అలాగే మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనున్న పరీక్షలను పటిష్టంగా, పారదర్శకంగా నిర్వహించాలన్నారు. అభ్యర్థులను ఉదయం 08.30 గంటల నుంచి 09.30 గంటల వరకు, మధ్యాహ్నం 01:30 నుంచి 02.15 గంటల వరకు మాత్రమే పరీక్ష కేంద్రంలోకి అనుమతించాలి సూచించారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కార్యకలాపాలకు తావు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని కడప నగర పరిధిలో 01, చింతకొమ్మ దిన్నె మండల పరిధిలో 03 పరీక్ష కేంద్రాలతో కలిపి మొత్తం 4 కేంద్రాలను ఎంపిక చేసినట్లు చెప్పారు. కడప నగర పరిధిలో శ్రీనివాస ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, కేఓఆర్‌యం మెమోరియల్ కాలేజీ అఫ్ ఇంజనీరింగ్, కేఎస్ఆర్ఎం కాలేజీ అఫ్ ఇంజనీరింగ్, కేయల్‌యం కాలేజీ అఫ్ ఇంజనీరింగ్ కేంద్రాలుగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్లు, లైజెస్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటిండెంట్లు సంబందిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దిగడం సరే.. ఎక్కడమెలా!

- కన్ఫ్యూజ్ హాల్టింగ్ ఆర్డర్స్
- రైల్వే అధికారుల వింత వైఖరిపై విమర్శలు
- ఆందోళనలో ప్రయాణికులు



తిరుమల ఎక్స్‌ప్రెస్‌రైలు

రాజంపేట: ఒక రైలుకు ఒక స్టేషన్‌లో హాల్టింగ్ ఇస్తే.. ఆ రైలు అప్, డౌన్‌లకు హాల్టింగ్ ఉన్నట్లే.. అయితే గుంతకల్లు డీఆర్ఎం(కోచ్) పేరిట విడుదలైన ఉత్తర్వులలో హాల్టింగ్స్‌పై వింతవైఖరి శనివారం బట్టబయలైంది. పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కన్ఫ్యూజ్ హాల్టింగ్ ఆర్డర్స్ జారీ చేసి ప్రయాణికులను గందరగోళంలోకి నెట్టేశాయి. మోదీ పాలనలో అడ్డగోలుగా అధికారులు తీసుకుంటున్న వింత నిర్ణయాలతో కేంద్రం పేద, మధ్యతరగతి వారి నుంచి చెడ్డపేరు మూటకట్టుకుందనే విమర్శలున్నాయి. ఈ పరిస్థితి ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో రైల్వేపరంగా గుర్తింపు కలిగిన నందలూరు రైల్వేకేంద్రంలో చోటుచేసుకుంది. కడప నుంచి విశాఖకు (17487) తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలుకు నందలూరులో హాల్టింగ్ ఎత్తివేశారు. అయితే విశాఖ నుంచి తిరుపతికి వచ్చే తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలుకు నందలూరులో హాల్టింగ్ ఇచ్చారు. ఎక్కేందుకు వీలులేకుండా, వచ్చేందుకు వీలు కల్పించే హాల్టింగ్ ఇచ్చారు. అలాగే 17415 నంబరుతో నడిపించే తిరుపతి నుంచి కోల్హాపూర్‌కు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలుకు హాల్టింగ్‌ను ఎత్తివేశారు. అయితే కోల్హాపూర్ నుంచి తిరుపతికి వెళ్లే ఎక్స్‌ప్రెస్‌కు నందలూరు హాల్టింగ్‌ను ఇచ్చారు. ఈ విధంగా హాల్టింగ్స్ ఇవ్వడం విడ్డూరంగా ఉందని రైల్వే వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి.

ఓబులవారిపల్లె, రాజంపేటలో..


ఓబులవారిపల్లెలో రైల్వే జంక్షన్‌లో నందలూరు రైల్వేకేంద్రం తరహాలోనే 17415 నంబరు గల తిరుపతి –కోల్హాపూర్, తిరుపతి–నిజాముద్దీన్, నిజాముద్దీన్–తిరుపతి మధ్య నడిచే (12793/12794) రైలుకు పూర్తిగా హాల్టింగ్ ఎత్తివేశారు. రాజంపేట రైల్వేస్టేషన్‌లో మధురై నుంచి లోకమాన్యతిలక్ (22102)కు హాల్టింగ్ ఎత్తేశారు. ఎక్కడానికి మాత్రమే హాల్టింగ్, దిగడానికి హాల్టింగ్ లేకుండా చేశారు. రాజంపేట పరిసర ప్రాంతాల నుంచి అనేక మంది కంటి ఆపరేషన్లకు మధురైకు వెళుతుంటారు. అదే రైల్లో తిరిగి తమ గమ్యాలకు చేరుకుంటున్నారు. వారు రైల్వే అధికారులు తీసుకున్న వింత నిర్ణయాలపై పెదవి విరిస్తున్నారు. ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌లో కాచిగూడ నుంచి చెంగల్పట్టుకు వెళ్లే (17652)రైలుకు హాల్టింగ్ ఎత్తివేశారు.

నందలూరుపై నిర్లక్ష్య ధోరణి



నందలూరు రైల్వేకేంద్రంపై గుంతకల్లు రైల్వే అధికారుల నిర్లక్ష్య ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. రైళ్ల హాల్టింగ్ విషయంలో అనాలోచిత నిర్ణయాల వల్ల కార్మికులు, రిటైర్డ్ కార్మికులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రైల్వేబోర్డు, దక్షిణమధ్య రైల్వే అధికారులు సానుకూలంగా ఉన్నా.. గుంతకల్లు అధికారుల తప్పుడు నిర్ణయాలతో నందలూరు నిర్వీర్యమవుతోంది.
–షాజహాన్, ముస్లిం నేత, నందలూరు

ఓబులవారిపల్లెపై చిన్నచూపు



ఓబులవారిపల్లె రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ విషయంలో గుంతకల్లు రైల్వే అధికారుల చిన్నచూపు కనిపిస్తోంది. హాల్టింగ్ తీసేయడం, పెట్టడం వారి ఇష్టమైపోయింది. రాయలసీమ రైలుతో పాటు హరిప్రియ రైలుకు హాల్టింగ్ ఎత్తేశారు. దిగేందుకు హాల్టింగ్ లేదు, ఎక్కేందుకు హాల్టింగ్ ఇవ్వడంపై రైల్వే అధికారుల వింత వైఖరి స్పష్టంగా కనిపిస్తోంది. –సుబ్బనరసయ్య,
జిల్లా అధ్యక్షుడు, సమతా సైనిక్‌దళ్, ఓబులవారిపల్లె

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

ఖాజీపేట : విద్యుత్ షాక్ తగిలి చెర్లోపల్లెకు చెందిన ఈనం సువార్డన (22) మృతి చెందారు. ఉదయం ఇంటిలో మోటారు మరమ్మత్తు చేసే పనిలో భాగంగా విద్యుత్ తీగలు తీసుకుని పరిశీలిస్తుండగా అకస్మాత్తుగా షాక్ తగిలింది. దీంతో అక్కడిక్కడే ఆయన సొమ్మసిల్లి పడిపోయాడు. చికిత్స నిమిత్తం తండ్రి వెంకటసుబ్బయ్య ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్యో కేంద్రానికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి కడప రిమ్స్‌కు తరలించారు.

బైక్ ఢీకొని రైతు దుర్మరణం


మృతిచెందిన సుదర్శన్‌రెడ్డి

తొండూరు : మండలంలోని సంతకొవ్వూరు సమీపంలో శనివారం బైకు ఢీకొని ఒకరు మృతి చెందారు. మృతుడి బంధువుల కథనం మేరకు.. రైతు సుదర్శన్‌రెడ్డి తన పొలం వద్దకు గంగనపల్లె మీదుగా ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బైకు ఢీకొంది. సుదర్శన్‌రెడ్డికి గాయాలవడంతో చికిత్స నిమిత్తం వెంటనే 108 వాహనంలో పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బెంగళూరుకు తరలిస్తుండగా పులివెందుల దాటగానే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఈ విషయమై ఎస్సై లక్ష్మీనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ జెండా దిమ్మె ధ్వంసం


పగుల గొట్టిన దిమ్మె

జమ్మలమడుగు : జమ్మలమడుగు పట్టణంలోని పదో వార్డు కన్నెలూరు కోతి సమాధి వద్ద వైఎస్సార్‌సీపీ జెండాను తొలగించి దిమ్మెను గుర్తు తెలియని వ్యక్తులు పగుల గొట్టారు. గడప గడపకు కార్యక్రమంలో భాగంగా కన్నెలూరు గ్రామంలోని నాయకులు అప్పటి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చేతుల మీదుగా దీరిరి ఆవిష్కరించారు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో అక్కడ ఉన్న దిమ్మెతోపాటు జెండాకోసం ఏర్పాటు చేసిన పైప్‌ను సైతం తీసుకువెళ్లారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ


గాయపడిన మంజులకు చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

వేంపల్లె : పట్టణ పరిధిలోని క్రిస్టియన్ కాలనీలో శనివారం ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. వేంపల్లెలోని క్రిస్టియన్ కాలనీలో పది రోజుల కిందట పండు అనే వ్యక్తి పుట్టినరోజు వేడుకల్లో స్థానికులు గంగాధర్, చందు మధ్య చిన్నపాటి వాగ్వాదం చోటుచేసుకుంది. అది మనసులో పెట్టుకుని శనివారం చందు, ఏసు, మరియమ్మ, మమత అదే కాలనీకి చెందిన గంగాధర, భారతి, మంజుల ఘర్షణ పడ్డారు. చందు, మంజులకు స్వల్ప గాయాలవగా చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కీచక ఉపాధ్యాయుడు

- విద్యార్థినుల పట్ల అసభ్యకర ప్రవర్తన
- పాఠశాల ఎదుట తల్లిదండ్రుల ఆందోళన




ఉపాధ్యాయుడిని పాఠశాల వద్దకు పిలిపించాలని నిరసన తెలుపుతున్న విద్యార్థినుల తల్లిదండ్రులు

లక్కిరెడ్డిపల్లి : అభం శుభం తెలియని చిన్నారులు వారు. చదువు తప్ప మరో ప్రపంచం తెలియని వయసు. పాఠాలు నేర్పించాల్సిన ఓ ఉపాధ్యాయుడు వారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడారు. పాఠశాలలు తెరిచినప్పటి నుంచి రోజూ గదిలో అతని చేతిలో నలిగిపోయారు. రోజు రోజుకి వేధింపులు ఎక్కువ కావడంతో శుక్రవారం సాయంత్రం తల్లిదండ్రులకు చెప్పుకొని బోరున విలపించారు. దీంతో తల్లిదండ్రులు పాఠశాల ప్రధానోపాధ్యాయుడి దృష్టికి తీసుకురావడంతో బాగోతం బట్టబయలైంది. ఈ సంఘటన లక్కిరెడ్డిపల్లి మండలం రవీంద్రనగర్ ప్రాథమిక పాఠశాలలో చోటు చేసుకుంది. తల్లిదండ్రుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు తన వద్ద చదువుకుంటున్న వారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని ముగ్గురి విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం మీడియా దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై విద్యార్థులను ఆరా తీయగా.. రోజూ తరగతి గదిలోకి పిలిచి చేతులు వేసి అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని కన్నీరు మున్నీరుగా విలపించారు. ఎదురు తిరిగి మాట్లాడితే బెత్తంతో కొట్టేవాడని రోదించారు. 4, 5 తరగతులకు చెందిన పలువురి విద్యార్థినుల పట్ల ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ప్రధానోపాధ్యాయురాలు విజయ కుమారి దృష్టికి తీసుకువెళ్ల లేదా అని విద్యార్థినులను అడుగగా.. హెచ్‌ఎంకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు సెలవు సాకుతో పాఠశాలకు డుమ్మాకొట్టి ఉపాధ్యాయ సంఘ నేతలతో చర్చిస్తూ రాయబారాలు నడిపే ప్రయత్నం చేశాడు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్దకు చేరుకొని ఆ ఉపాధ్యాయునికి తామే బుద్ధి చెబుతామంటూ పేర్కొంటూ.. అక్కడే నిరసన తెలియజేశారు. ఈ విషయాన్ని లక్కిరెడ్డిపల్లి ఎంఈఓలు చక్రేనాయక్, వెంకటసుబ్బయ్య దృష్టికి తీసుకువెళ్లగా.. వారు తమ కార్యాలయానికే విద్యార్థినులను పిలిపించి విచారణ చేశారు. వారు జరిగిన విషయం చెబుతూ కన్నీటి పర్యంతమయ్యారు. అక్కడికి కూడా ఉపాధ్యాయ సంఘ నేతలు చేరుకుని రాజీ చేసేందుకు ప్రయత్నించగా.. విద్యార్థినుల తల్లిదండ్రులు తిరగబడటంతో వెళ్లిపోయారు. తమ పిల్లలకు జరిగిన అన్యాయం మరెక్కడా జరగకుండా ఉండాలంటే ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లును కఠినంగా శిక్షించాలని జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకుంటామని ఎంఈఓ చక్రేనాయక్ తెలియజేశారు.

నీటి సంపులో పడి ఆర్టీపీపీ ఉద్యోగి మృతి


హుసేన్ బాషా(ఫైల్)


మృతదేహాన్ని సంపు నుంచి బయటకు తీసుకున్న దృశ్యం

ఎర్రగుంట్ల : డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు నందు డీఎం ప్లాంట్‌లో జేపీఏగా పనిచేస్తున్న చామూరు హుస్సేన్ బాషా(47) ప్రమాదవశాత్తూ డీఎం ప్లాంట్‌లోని సంపులో పడి మృతి చెందారు. కలమల్ల పోలీసులు శనివారం వివరాలు వెల్లడించారు. జమ్మలమడుగు పట్టణానికి చెందిన చామూరు హుస్సేన్‌బాషా ఆర్టీపీపీలోని డీఎం ప్లాంట్ నందు జేపీఏగా పనిచేస్తున్నాడు. ఇతడికి భార్య హసీనాతోపాటు ఇద్దరు కుమారులున్నారు. శుక్రవారం రోజూ మాదిరిగానే జమ్మలమడుగు నుంచి డ్యూటీకి వచ్చాడు. డీఎం ప్లాంట్‌లో ఉన్న నీటి సంపులో శాంపిల్ తీసుకోవడానికి వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తూ సంపులో పడిపోయాడు. ఎంత సేపటికీ నీటిని తీసుకురాకపోవడంతో ల్యాబ్ డ్యూటీలో ఉన్న కెమిస్ట్రీ ఏఈ గంగాధర్ రెడ్డి సంపు వద్దకు వచ్చి చూశారు. సంపు వద్ద హుసేన్ బాషా చెప్పులు చూసి సమాచారం ఎస్పీఎఫ్, ఫైర్, ఆర్టీపీపీ అధికారులకు తెలిపారు. నీటి సంపులో గాలించిన సిబ్బంది శనివారం ఉదయం మృతదేహాన్ని బయటకు తీశారు. ఏఈ గంగాధర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కలమల్ల హెడ్‌కానిస్టేబుల్ రమణారెడ్డి తెలిపారు.

శ్రీశైలం నుంచి నీటిని విడుదల చేయాలి

కడప వైఎస్సార్ సర్కిల్ : శ్రీశైలం జలాశయంలో 854 అడుగుల నీటిమట్టం ఉండగానే.. పోతిరెడ్డిపాడు నుంచి రాయలసీమ నీటిపారుదల ప్రాజెక్టులకు నీటిని విడుదల చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రైతులు సాగుకు సమాయత్తమవుతున్న నేపథ్యంలో కృష్ణా జలాలు కేసీ కెనాల్ ఆయకట్టు, తెలుగుగంగ, గాలేరు నగరి, హంద్రీనీవా ప్రాజెక్టులకు విడుదల చేయాలన్నారు. ఈ ఏడాది ఎగువ రాష్ట్రాలలో కురుస్తున్న భారీ వర్షాలకు తుంగభద్ర, కృష్ణానదుల్లో ప్రవాహం పెరిగిన నేపథ్యంలో 854 అడుగుల వద్ద ఉండగా.. నీటిని విడుదల చేయవచ్చునన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాయలసీమలో పెండింగ్ ప్రాజెక్టులకు సమయం కేటాయించాలన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


టార్గెట్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్, తదితరులు

వేంపల్లె : ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, విజయాలను సొంతం చేసుకోవాలని టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ నిమ్మకాయల షేక్‌దర్బార్ తెలిపారు. శనివారం స్థానిక జెడ్పీ క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి టార్గెట్ బాల్ ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఏర్పరచుకుని ముందుకెళ్లాలని, అప్పుడే విజయాన్ని సాధించవచ్చునన్నారు. టార్గెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షురాలు సంధ్య మాట్లాడుతూ కడప, అనంతపురం, సత్యసాయి, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణాజిల్లాలతో పాటు ఆయా జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. ప్రతిభ కనబరిచిన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో టార్గెట్‌బాల్ సౌత్ జోన్ చైర్మన్ రేవంత్, గండి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మల్లారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రశేఖర్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చీనీ వ్యాపారిపై తెలుగు తమ్ముళ్ల దాడి


చికిత్స పొందుతున్న శివసుమన్ కుమార్‌రెడ్డి

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : వైఎస్సార్ జిల్లా పులివెందుల మార్కెట్ యార్డు సమీపంలోని ఒక హోటల్ వద్ద చీనీ వ్యాపారిపై తెలుగు తమ్ముళ్లు దాడి చేసిన సంఘటన శని వారం చోటుచేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. వీరపునాయునిపల్లె మండలం పాయసంపల్లెకు చెందిన శివసుమన్‌కుమార్‌రెడ్డి శనివారం తాను పండించిన చీనీ కాయలను పులివెందుల మార్కెట్‌యార్డులోని మండీలో విక్రయించేందుకు వచ్చాడు. చీనీ కాయలు విక్రయించిన తర్వాత శనివారం మధ్యాహ్నం స్థానిక హోటల్‌కు భోజనానికి వెళ్లాడు. ఆర్డర్ ఇచ్చిన కొద్ది నిముషాలలోనే మూడు సార్లు కరెంటు పోయింది. దీంతో శివసుమన్ కుమార్‌రెడ్డి పక్కన ఉన్న వారితో తెలుగుదేశం ప్రభుత్వంలో కరెంటు కోతల కష్టాలుంటాయని పేర్కొన్నాడు.. ఇంతలో అక్కడే ఉన్న తెలుగుదేశం పార్టీకి చెందిన కొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు మా పార్టీని, మా నాయకులను విమర్శిస్తావా.. అంటూ శివసుమన్‌కుమార్‌రెడ్డిపై విచక్షణా రహితంగా దాడి చేయడంతో గాయాలయ్యాయి. బాధితుడు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందాడు.

ప్రొద్దుటూరులో నలుగురు ఎమ్మెల్యేలు

మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి


రోడ్ల విస్తరణకు ఇచ్చిన మార్కింగ్‌ను చూపుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు

ప్రొద్దుటూరు : ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక ప్రొద్దుటూరులో నలుగురు ఎమ్మెల్యేలుగా తయారయ్యారని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి ఎద్దేవా చేశారు. నంద్యాల వరదరాజులరెడ్డితోపాటు నంద్యాల కొండారెడ్డి, ప్రవీణ్ కుమార్‌రెడ్డి, సీఎం సురేష్‌నాయుడు కూడా ఎమ్మెల్యేల మాదిరి వ్యవహరిస్తున్నారని తెలిపారు. శనివారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో ర్యాంపులను తొలగించాలని వరదరాజులురెడ్డి అధికారులను ఆదేశించారని పేర్కొన్నారు. వైఎంఆర్ కాలనీలో మున్సిపల్ అధికారులు ర్యాంపు తొలగించేందుకు వెళ్లగా ప్రవీణ్ కుమార్‌రెడ్డి వెనక్కు పంపారన్నారు. వరదరాజులరెడ్డి సోదరుడు భార్గవ రెడ్డి కుమారుడు అరుణ్‌రెడ్డి అక్రమంగా కుందూ నది నుంచి ఇసుకను తరలిస్తుంటే తాను ప్రభుత్వానికి ఫిర్యాదు చేశానని వెల్లడించారు. ర్యాంపులు తొలగించేందుకు వరదరాజులురెడ్డి మున్సిపల్ అధికారులను తన ఇంటి వద్దకు పంపించారని బహిరంగంగా ప్రవీణ్ చెప్పారని గుర్తు చేశారు. అభివృద్ధికి సంబంధించిన ఏ విషయమైనా నలుగురు నాయకులు కూర్చొని నిర్ణయించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే ఆంధ్ర కేసరి రోడ్డు, కొర్రపాడు రోడ్డులో వంద అడుగుల రోడ్డు విస్తరణకు అధికారులు మార్కింగ్ ఇస్తున్నారని, వాస్తవానికి ఇంతవరకు ప్రతిపాదనలు తయారుచేయలేదని అన్నారు. మార్కింగ్ ఇచ్చి ఇళ్ల యజమానులకు నిద్ర లేకుండా చేస్తున్నారన్నారు. రేపో మాపో జమ్మలమడుగు రోడ్డు, గాంధీ రోడ్డులలో మార్కింగ్ ఇచ్చే అవకాశం ఉందన్నారు. రోడ్ల విస్తరణ చేపట్టాలంటే కోట్ల రూపాయల నిధులు అవసరమని, అనుభవజ్ఞుడైన వరదరాజులరెడ్డికి ఇది తెలియదా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అయిల్‌మిల్ ఖాజా, కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, సత్యం, జిలానీ బాషా, చింపిరి అనిల్‌కుమార్, పాతకోట మునివంశీధర్‌రెడ్డి, ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, గరిశపాటి లక్ష్మీదేవి, పోసా వరలక్ష్మి భాస్కర్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని బాలిక మృతి


రెడ్డమ్మ (ఫైల్)


ఘటనా స్థలంలో మృతి చెందిన రెడ్డమ్మ

వల్లూరు : మండలంలోని పెద్దపుత్త గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుగ్గాయపల్లెకు చెందిన బాలిక రెడ్డమ్మ (13) అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్‌ఐ వెంకటరమణ సమాచారం మేరకు.. కమలాపురం మండలం పొడదుర్తి వెంకటాపురానికి చెందిన సుబ్బరాయుడు, రుక్మిణిల కుమార్తె దుగ్గాయపల్లెలోని అమ్మమ్మ ఇంట్లో ఉండి పెద్దపుత్తలోని జడ్పీ హైస్కూల్‌లో ఏడో తరగతి చదువుతోంది. రెడ్డమ్మ రోజూ సైకిల్ పై పాఠశాలకు వెళ్లి వస్తోంది. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వెళ్తున్న క్రమంలో పైడికాలువ క్రాస్ వద్ద రాళ్ల ట్రాక్టర్ రెడ్డమ్మ సైకిల్‌ను ఢీకొంది. ఈ ఘటనలో రెడ్డమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. బాలిక మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి తీగల చోరీ


ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలిస్తున్న అధికారులు

కమలాపురం : కమలాపురం మండలం కోగటం గ్రామంలో పొలాలకు సాగునీరు అందించేందుకు ఏర్పాటుచేసిన మూడు ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి తీగలు చోరీకి గురైనట్లు ఏఈఈ షేక్ షబ్బీర్‌హుసేన్, టెక్నికల్ అసిస్టెంట్ చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. విలేకరులతో వారు మాట్లాడుతూ 2017 జూలైలో 2200 ఎకరాల ఆయకట్టు అభివృద్ధికోసం ఎత్తిపోతల పథకం నిర్మించామని, అయితే రైతులు వినియోగించుకోకపోవడంతో మూలన పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో గుర్తు లియని దుండగులు మూడు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులో విలువైన కాపర్ వైరు దొంగలించారన్నారు. వాటి విలువ సుమారు రూ.15 లక్షల వరకు ఉంటుందని తెలిపారు.

రాజా ఫౌండేషన్ ఆస్తులపై విచారణ జరిపించండి


డీటీ సాయినాథరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ప్రజాపక్షం నాయకులు

ప్రొద్దుటూరు : రాజా ఫౌండేషన్‌కు సంబంధించిన ఆస్తుల, ఆదాయ వివరాలపై ప్రభుత్వం ప్రత్యేకంగా విచారణ కమిటీని నియమించాలని ప్రజాపక్షం అధ్యక్షుడు పుత్తా లక్ష్మిరెడ్డి, ఉపాధ్యక్షుడు వైసీ నారాయణరెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం వారు డిప్యూటీ తహసీల్దార్ సాయినాథరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పుత్తా లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ రాజారెడ్డి హత్య అనంతరం ఫౌండేషన్‌ను ఏ విధంగా శ్రీత్రిదండి చిన్నజీయర్ స్వామి ట్రస్టుకు మార్పు చేశారని, ప్రస్తుతం ట్రస్టులోని సభ్యులను ఏ అర్హతలతో నియమించారని ప్రశ్నించారు. ఎంతో మంది అభాగ్యులు, అనాథల కోసం రాజారెడ్డి ఉన్నత ఆశయంతో 2002లో రాజా ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు.

ప్రభుత్వమే నిర్వహించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : పూజా స్కూల్, డాడీహోంను ప్రభుత్వం నిర్వహించాలని ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ నాయకులు శనివారం డిప్యూటీ తహసీల్దార్ సాయినాథరెడ్డికి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్ మాట్లాడుతూ డాడీహోం వ్యవస్థాపకుడు రాజారెడ్డి మరణానంతరం పూజా స్కూల్, డాడీహోం ఆస్తులను కబ్జా చేసేందుకు కొంత మంది ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని అనాథ పిల్లలకు ఆశ్రయం కల్పించి, ఆసరా నిలుస్తున్న పూజా ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భాస్కర్, లింగమయ్య పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకులను శుభ్రం చేయాలి


మాట్లాడుతున్న డీపీఓ ప్రభాకర్‌రెడ్డి

ప్రొద్దుటూరు : వాతావరణ పరిస్థితులు మారిన నేపథ్యంలో ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు భూతల, ఉపరితల జలాశయాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ప్రొద్దుటూరులోని మండల పరిషత్ కార్యాలయంలో డివిజనల్ పంచాయతీ అధికారి రమణారెడ్డి ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ వాటర్ ప్లాంట్లలోసైతం ప్రతి 15 రోజులకోసారి క్లోరినేషన్ చేయించాలన్నారు. పారిశుధ్య పనులకు సంబంధించి రిజిస్టర్‌ను నిర్వహించాలని తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించాల్సిన అవసరం మనపై ఉందన్నారు. ఇంటి పన్ను బకాయిలు లేకుండా చూడాలని, ఇంటింటి సర్వే పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుళ్లాయమ్మ, ఈఓపీఆర్డీలు రామాంజనేయరెడ్డి, షాకీర్‌ఆలీఖాన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగభరత్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.